# శరత్ వర్షం

ఎ.వి.వి.యస్ యస్.ప్రసాద్

శరత్ వర్షం కురుస్తోంది——॥

చినుకులు చూసేసరికి శాంతారామ్ గారిలో ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది.

ఎప్పుడో చిన్నప్పుడు-

ఇంటి అరుగుమీద వణుకుతూ కూర్చొని, కాగితం పడవలు వదలడంలో ఆనందం అనుభవించారు.

తరువాత కాస్త ఎదిగాక-

ఓ రోజు-

ఎక్కడ్నుంచో వస్తూంటే-

బస్సు దిగారో లేదో, వాన ప్రారంభమయ్యింది.

బస్సు దిగాక దాదాపు ఒక కిలోమీటరు నడవాలి వూళ్ళోకి వెళ్ళాలంటే.

మెల్లగా నడక ప్రారంభించారు.

చిరుజల్లు శరీరమ్మీదపడి చిందులు వేస్తుంటే గొప్ప ఆనందానుభూతి కల్గింది.

అందులోను శుక్లపక్షం!

దానికితోడు శరత్ పూర్ణిమ!

చంద్రుడు నిండుగా వెన్నెలలో వెన్నముద్దలా వున్నాడు.

వెన్నెల, వానతో కలిసి 'ఆనందనాట్యం' చేస్తోంది.

చిరుజల్లులో-

నీలాకాశంలో కలువరేడుని చూస్తూ-

విచిత్రంగా మెరుస్తున్న వెన్నెలలో నడుస్తుంటే;

——ఆనాడు వణుకుతూ వేసిన అడుగులు ఇప్పటికీ జ్ఞాపకాల ఆనందపు నీడలు-!

అప్పట్నుంచి శాంతారామ్‌గారికి అది అలవాటుగా మారిపోయింది.

'శరత్'లో-

శుక్లపక్షంలో-

చంద్రుడు 'వెండిభరిణి'లా వున్నప్పుడు-

చిరుజల్లు నింగినుండి నేలకి ఏదో పర్తమానం తీసుకువస్తూ-

శాంతారామ్‌గారిని 'సౌంజ్ఞ చేసి, పిలిచినట్టు అన్పిస్తే-

అడుగులో అడుగు వేసుకుంటూ,

చినుకులని లెక్కపెడ్తూ,

వెన్నెలతో ముచ్చటలాడ్తూ-

నిశ్శబ్దం మాటలాడుకొనే మాటలు నిశ్శబ్దంగా వింటూ,

వణుకుతూ-

నడిస్తే!

స్వప్న ప్రపంచాల సౌందర్యాలు కళ్ళముందు కదిలిన అనుభూతి-!

వానలో తడిస్తే జలుబు, జ్వరం వస్తాయని మొదట తల్లి, తరువాత భార్య ఎంత వద్దన్నా, వినేవారు కారు.

"...ఆ ఆనందం మీకేం తెలుసు? వెన్నెల గుమ్మంలోకి వచ్చి పిలిచినట్టు, చినుకుల శబ్దం స్వాగత గీతం ఆలపిస్తున్నట్టు, చంద్రుడు మిత్రుడిలా ఆహ్వానిస్తున్నట్టు-" ఇలా సాగిపోయేది అతని ధోరణి.

ఎవరూ ఆయనకి సమాధానం చెప్పలేకపోయేవారు.

ఇవాళ!

మళ్ళీ ఇన్నాళ్ళకి-!

మునపటి వాతావరణం!

అదే వెన్నెల, అదే పూర్ణిమ, అదే చంద్రుడు. అవే చినుకులు!

ఈ మధ్య 'సుస్తీ' చేయడంవల్ల ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది.

వయస్సు కూడా యాభై దాటడంవల్ల వంట్లో శక్తి నశించింది.

కానీ-

ఏదో శక్తి-

కదిలించింది!

వానని చూస్తూ కూర్చోలేకపోయారు.

మెల్లగా లేచి—

లాల్చీ వేసుకొని, గొడుగు తీసుకొని, కాశ్మీర్ శాలువ కప్పుకొని, చేతి కర్ర అందుకొని-

కదిలారు!

పిల్లలకి పెళ్ళిళ్ళు అవ్వడం వల్ల, వాళ్ళు దూర ప్రాంతంలో వున్నారు.

భార్య మొన్ననే ఆమెతరుపు వాళ్ళింట్లో 'పెళ్ళి' కెళ్ళింది. తమూ రమ్మని మరీ మరీ పిల్చారు కానీ, ఓపిక లేక వెళ్ళలేదు.

మెల్లగా నవ్వుకున్నారు.

చినుకులు చూసేసరికి కదలడం.

వాళ్ళు ఎంతో బ్రతిమాలినా కదలక పోవడం గుర్తొచ్చి-!

ఇంటికి తాళంవేసి, నడక ప్రారంభించారు,

చిరుజల్లే!

వీధి చివర్న వున్న కరెంటు స్తంభం లైటు వానలో అందంగా మెరుస్తోంది.

అలా అరగంట దాటి వానలో తిరిగినా 'తృప్తి'గా లేదు.

ఇంకా తిరగాలని అన్పిస్తున్నా మీద పడ్డ 'వయస్సు' సహకరించడం లేదు.

తిరుగు ముఖం పట్టారు.

వస్తున్నప్పుడు-

చినుకుల చాటున కన్పించింది ఆ దృశ్యం.

కరెంటు స్తంభం పక్కన చలికి వణుకుతూ, వాన చినుకులకి ముడుచుకు తున్న ముసలివాడు—

అంతకుముందే కరెంటు స్తంభం పక్కనుండే వెళ్ళినా వాడ్ని చూళ్ళేదు—

చిన్నగా మూలుగుతూ, వణికిపోతున్నాడు.

వాడి వంటిమీద చిన్న గోచీలాంటిది తప్ప, మరేదీ లేదు.

శరీరము ముడుతలు పడి వుంది.

కళ్ళలో ఆర్తి—

సహాయం చేయమన్నట్టు-

శాంతారామ్‌గారిని చూసి-

అంత చలిలోనూ, చేతులు జోడించాడు,

దాదాపు తన వయస్సువాడే—విపరీతమైన బాధని అనుభవిస్తున్నాడు.

తనకి – ఆనందానుభూతి!

వాన ఒక్కటే—

ఒకరికి విషాదం!

ఒకరికి ఆనందం!

ఒకరి కళ్ళలో అనుభూతి తాలూకు అశ్రువులు!

మరొకరి కళ్ళలో భరించలేని బాధకి చిహ్నల్లా-కన్నీళ్ళు-

వాన ఏదో చెప్తున్నట్టు, వెన్నెల ఏదో ఆజ్ఞాపిస్తున్నట్టు, చంద్రుడు పరోక్ష మిత్రుడిక్క' సహాయం చేయమన్నట్టు—

వంటిమీది శాలువాని తీసి, వాడి మీదకి విసిరి, అక్కడ్నుండి వేగంగా దిలారు.

"శరత్ వర్షం ఇంకా కురుస్తోనే వుంది—!" ●

